తను మామగారికి ఉత్తరం రాసి చాలా రోజులయిపోయింది. ఆ మధ్య "మనవణ్ణి చూదామనుంది ఓసారి రావాలనుకుంటున్నాను" అని వ్రాశాడాయన. 'రండి, చాలా ఆనందిస్తాము, అసలు రమ్మని మేమే రాయాలనుకుంటున్నాము. చిట్టిగాడు 'తాత, తాత అంటున్నాడు' అని వ్రాయాలని (లేకపోతే బాగుండదని) అనుకున్నాడు తనే. కాని ఏమిటో రాయడమే పడలేదు.

పైగా మామగారికి ఉత్తరం రాయవలసిన సంగతేదైనా ఉంటే ఇద్దరి తరఫునా అన్నపూర్ణే రాయడం మామూలు. అన్నపూర్ణ రాస్తోంది గదా అని తను ప్రత్యేకం రాయకపోడం – ఏదో అలా అశ్రద్ధ అయిపోతూ వొస్తోంది.

పోనీ ఓ పేజీ ఖాళీగా వుంది. ఇందులో రాద్దామనుకుంటూ, అసలు అన్నపూర్ణ ఏమి వ్రాసిందో చూద్దామని, చదివాడు.

అన్నీ సరేకాని.

"ఎప్పుడో నాగవల్లి నాడు మీ రిస్తానన్న ఉంగరం ఇవ్వలేదని మీ అల్లుడుగారి కింకా బాధగానే వుంది. ఏదో సమయం చూసి నన్ను దెప్పిపొడుస్తూ వుంటారు. ఈ మధ్యనే ఓమారు అన్నారు కూడానూ. అందుచేత ఈమారు మీరు వచ్చేటప్పుడు ఆయనికి మీ రివ్వవలసిన ఉంగరం చేయించుకొని రావలెను. మరిచి పోవద్దు. అన్నయ్య వేలి కొలత ..."

ఈ వాక్యాలు చూసేక శేఖర్రావుకి నవ్వు ఆగలేదు.

ఆ ఉంగరం సంగతి అతనెప్పుడో మరిచిపోయాడు.

మామగారు ఏవో యిస్తాననడం, తను ఏవో కావాలనుకోడం, వాటికోసం పట్టుదలగా అడుగుతూ సమయం దొరికిందే చాలని సాధిస్తూ ఉండడం, ఇలాటివంటే అసహ్యం శేఖర్రావుకి. చీటికీ మాటికీ మామగారిమీద ఆధారపడడం, వారు తన కోర్కెలు తీర్చకపోతే అలిగి కోపపడి బాంధవ్యాన్ని కలుషితం

